అడవికి కంచె.. పంటకు రక్ష

- వన్యప్రాణులు అడవి నుంచి బయటకు రాకుండా చర్యలు
- అడవి చుట్టూ 2.1 కిలో మీటర్ల మేర కంచె నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


అడవికి ఇనుప కంచె వేసేందుకు స్తంభాలు పాతుతున్న దృశ్యం

పాములపాడు: నల్లమల అటవీ ప్రాంతం సమీపం ప్రాంతాల్లో తరచూ వన్యప్రాణులు రావడం, పంట పొలాలను నాశనం చేయడం పరిపాటిగా మారింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పుడప్పుడు గ్రామాల్లోకి కూడా వస్తుండంటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం అటవీ చుట్టూ కంచె వేసేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతో తమ ఏళ్లనాటి కల నెరవేరుతోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడవి జంతువులతో పైర్లు నాశనం

మండలంలోని యర్రగూడూరు, బానుముక్కల, బానకచెర్ల, వేంపెంట గ్రామాలు నల్లమల అడవిని అనుకొని ఉన్నాయి. ఈ ప్రాంతంలో అడవి నుంచి వన్యప్రాణులు, క్రూర మృగాలు సైతం పొలాల పరిసరాలకు చేరుతున్నాయి. అడవి పందులు, ఎలుగుబంట్లు, జింకలు, దుప్పులు పంట పొలాలపై పైర్లను నాశనం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రూ.45లక్షలు మంజూరు

మండలంలోని బానుముక్కల పరిధిలోని (యర్రగూడూరు సమీపంలో) బానకచెర్ల గ్రామం పరిసర అడవికి 2.1 కిలో మీటర్ల మేర ఇనుప కంచె వేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కామెంట్ ఫారెస్ట్ స్కీం ల్యాండ్స్ సేఫ్టీ అడవీ శాఖ నిధుల కింద రూ.45లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో వీఎస్ఎస్ (వన సంరక్షణ సమితి) ద్వారా పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కంచె నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రైతుల్లో హర్షం

కంచె ఏర్పాటు వల్ల అడవీ సమీప గ్రామ పొలాలకు ఇక నుంచి వన్యప్రాణుల బారి నుంచి పైర్లకు ముప్పు తప్పినట్లేనని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా కేవలం 2.1 కిలోమీటర్ల మేరను కాకుండా పంట పొలాలున్నంత వరకూ కంచె వేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. ఏది ఏమైనా అడవికి కంచె నిర్మాణం రైతులకు మేలు జరిగినట్లే.

కంచె ఏర్పాటు చేయడం సంతోషం


అడవిని ఆనుకొని మాకు 5 ఎకరాల పొలం ఉంది. మొక్కజొన్న పైరు సాగు చేస్తాము. ప్రతి సంవత్సరం అడవి పందుల నుంచి బెడద ఎక్కువగా ఉండేది. పంట కూడా చాలా వరకు దెబ్బతినేది. ఇప్పుడు కంచె వేయడం వల్ల పైర్లకు ఎంతో మంచిది.
–గుండు అశోక్, రైతు, యర్రగూడూరు

బానుముక్కల వద్ద కూడా ఏర్పాటు చేయాలి


గతంలో 12 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని సాగు చేసేవాడిని. అయితే అడవి జంతుల వల్ల పైర్లు నాశనమయ్యేవి. దీంతో ప్రస్తుతం సాగు చేయడం మానుకున్నాను. యర్రగూడూరు గ్రామం వైపు అడవీ శాఖ అధికారులు కంచె నిర్మాణం చేపడుతుండటం సంతోషించదగ్గ విషయం. బానుముక్కల గ్రామం వైపు కూడా కంచె ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – రామ్‌నాయక్, బానుముక్కల

ప్రస్తుతం నిధులు మంజూరైన మేరకు కంచె ఏర్పాటు


ప్రస్తుతం ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో 2.1 కిలో మీటరు మేర కంచె నిర్మాణం చేపట్టాము. నిధులు మంజూరైన మేరకు పనులు చేపడుతున్నాం. అడవి జంతువులకు మనుషుల నుంచి ఎటువంటి హాని జరుగకూడదు. జంతువులు అడవి నుంచి బయటకు రాకుండా కంచె ఉపయోగపడుతుంది. ఇంకా నిధులు మంజూరైతే మిగతా ప్రాంతాల్లో కూడా కంచె నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
–ఖాన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

క్లుప్తంగా

ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలోని శ్రీఈశ్వర, వీరభద్రస్వామి ఆలయ ముఖద్వారం నిర్మాణం కోసం బుధవారం దాతలు చంద్రారెడ్డి దంపతులు, వెంకటరెడ్డి దంపతులు భూమిపూజ చేశారు. పి.లింగాపురం గ్రామస్తుల ఇంటి ఇలవేల్పు కావటంతో గ్రామానికి చెందిన చంద్రారెడ్డి, వెంకటరెడ్డి, రంగారెడ్డి, మల్లికార్జునరెడ్డిలు సుమారు రూ.5లక్షల వ్యయంతో స్వామివారి ఆలయం ఎదుట ముఖద్వారం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ అనురాధ

వెలుగోడు: స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలను నంద్యాల డీఈఓ అనురాధ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపల్లి, ఆత్మకూరు, బండి ఆత్మకూరు, వెలుగోడు మండలాలకు చెందిన ఇంటర్ విద్యార్థినులకు వెలుగోడు కేజీబీవీ స్కూల్‌లో రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఈఓ విద్యార్థినులు, టీచర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఏ ఒక్కరూ కూడా మళ్లీ ఫెయిల్ కాకూడదన్నారు. అనంతరం నాడు–నేడు పనులను పరిశీలించారు. జూన్ 12వ తేదీ లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సచివాలయాలు


సూచనలిస్తున్న డీఎల్‌డీఓ జనార్దనరావు

మహానంది: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సచివాలయాలే కేంద్రాలని డీఎల్‌డీఓ జనార్దనరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులకు అందించడంతో సచివాలయాలే కీలకమని, సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. మహానంది సచివాలయాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం వద్దన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు వెళ్లి పింఛన్ అందజేత


కర్నూలు ఆసుపత్రిలో నాగన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రశాంతి

వెలుగోడు: మండలంలోని గుంతకందాల గ్రామానికి చెందిన కడతల పెద్ద బాల నాగన్న ఆరోగ్యం సరిగా లేని కారణంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటర్ ప్రశాంతి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. దీంతో గ్రామస్తులు ఆమెను అభినందించారు.

కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోండి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ఉపాధిహామీ పథకంలో పని చేసే రోజువారీ కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సమావేశ భవనంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధికూలీల సంఖ్యను ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ పెంచేలా గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పనికి వచ్చిన వారికి దిసరి కనీస వేతనం అందేలా కొలతలు ఇచ్చి, పనులు చేసేలా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకం మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీఎస్పీ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ


డీఎస్పీకి అభినందనలు తెలుపుతున్న ఆత్మకూరు సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ వెంకటసుబ్బయ్య

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ అధికారిగా శ్రీనివాసరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. 1991 బ్యాచ్ ఎస్ఐగా శ్రీనివాసరావు తొలుత గుంటూరు రేంజ్‌లో విధుల్లో చేరి పలు చోట్ల నిక్కచిగా వ్యవహరించే అధికారిగా పేరొందారు. అనంతరం ఆయన సీఐగా పదోన్నతి పొంది ఒంగోలు డీటీసీలోను, ట్రాన్స్‌కో విభాగంలో, ఎస్‌బీ విభాగంలో పని చేశారు. తదుపరి పదోన్నతిలో రాజమండ్రి డీఎస్పీగాను, ఎస్‌బీ నార్త్‌జోన్‌లలో విధులు నిర్వహించారు. అనంతరం బాపట్లలో మూడు సంవత్సరాలు డీఎస్పీగా పని చేసి బదిలీపై ఆత్మకూరు వచ్చారు. డీఎస్పీ శ్రీనివాసరావుకు సబ్ డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలు స్వాగతం పలికారు.

21.6 మిల్లీ మీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలో బుధవారం సాయంత్రం గంటపాటు ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. పారుమంచాల గ్రామశివారులోని ఇసుకవాగు ఉప్పొంగి ప్రవహించి గంటపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షం 21.6మిల్లీమీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు.

వివరాలు యాప్‌లో నమోదు చేసుకోవాలి


హాస్టల్ ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నందికొట్కూరు: పొదుపు మహిళలు తమ వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో పొదుపు మహిళలకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివరాలను యాప్‌లో నమోదులో చేసుకుంటేనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే వడ్డీ రాయితీలకు అర్హులన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మధు సూదర్శన్, ఏరియా కో ఆర్డినేటర్‌పుల్లయ్య, ఉపీఎం, సీసీలు, బక్‌కీపర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాలను పీడీ పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌డబ్ల్యుఓ మహేశ్వరుడు, ముంతాజ్‌బేగ్, ఏపీఎం మధుసుదర్శన్ తదితరులు న్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ లాలం రమేష్

వెలుగోడు: మండలంలో దీర్ఘకాలంగా అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీర్మానించిన పనులు, సమస్యలు ఎంత వరకు పరిష్కారం అయ్యాయనేది ఎంపీపీ సభ్యులకు వివరించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఉన్న సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, సమావేశం దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు శ్మశానవాటిక స్థలం చూపించాలని కోరారు. రేషన్ బియ్యం వాహనం ప్రతి నెల 10వ తేదీ తరువాత వస్తుందని, మొదటి వారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు జనాభారెడ్డి మాట్లాడుతూ.. వేల్పనూరులో లైన్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని, వెంటనే నియమించాలని కోరారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ..ఊరి బయట హైవే నిర్మాణం కోసం మార్కింగ్ వేయడంతో 81 ఇళ్లు పోతున్నాయని, బాధితులకు వేరే చోట ఇళ్ల స్థలాలు చూపించి పక్కా ఇళ్లు నిర్మించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో షేక్ అమానుల్లా, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, జెడ్పీటీసీ అమీరున్ బీ, వైస్ ఎంపీపీలు చికెన్ బాబు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడులు తెరిచేలోగా పనులు పూర్తిచేయాలి

జూపాడుబంగ్లా: పాఠశాలలు తెరిచేలోగా రెండో విడత నాడు–నేడు పనులు పూర్తిచేయాలని ఎంపీడీఓ మంజులవాణి, ఎంఈఓ మోహన్, పీఆర్ ఏఈ బషీర్ హెచ్‌ఎంలకు సూచించారు. బుధవారం జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు రెండో విడత పనులు మంజూరైన పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 30 ప్రభుత్వ పాఠశాలలు, 6 అంగన్‌వాడీ కేంద్రాలలో రెండో విడత నాడు–నేడు పనులకు ప్రభుత్వం రూ.11.47కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఇప్పటిదాకా రూ.2.95కోట్ల రివాల్వింగ్ ఫండు మంజూరు చేయగా అందులో రూ.1.70కోట్ల వెచ్చించినట్లు తెలిపారు. అలాగే బడి బయట ఉన్న విద్యార్థులను తల్లిదండ్రులతో మాట్లాడి తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంటు మనోజ్, వినోద్, కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ యశోద పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో రైతు గ్రూపుకు కిసాన్ హైరింగ్ కస్టం సెంటర్ కింద సబ్సిడీపై అందజేసిన వ్యవసాయ యంత్ర సామగ్రిని బుధవారం మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రవి పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో వైఎస్సార్‌యంత్ర సేవా పథకం కింద ప్రతి ఆర్బీకేకు పరికరాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులు గ్రూపుగా ఏర్పడి రూ.10 లక్షలు చెల్లించాలని సూచించారు. వారికి ఒక ట్రాక్టర్, గుంటిక, 5 చెక్కల నాగలి, రొటావేటర్‌లను అందజేస్తామని వివరించారు.

కార్మిక వర్గానికి పండుగ రోజు మేడే

పాములపాడు: కార్మిక వర్గానికి పండుగ రోజు మే డే అని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు లాజరసు, శిరీష అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట గ్రామంలో అమర వీరుల స్థూపాల వద్ద మే డే ను నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మత్రిస్వామి, నాయకులు అబ్రహాం, మస్తాన్, ప్రణయ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం

నందికొట్కూరు: కార్మికుల హక్కులను కాలరాస్తే సహించే ప్రసక్తే లేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మోహన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రధాన, పుర వీధుల వెంట మే డే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నాయకులు నరసింహులు అరుణ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం తగదు


గుడిపాడులో గ్రామసభ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

మిడుతూరు: జగన్న కాలనీ లే అవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలలో జాప్యం చేయడం తగదని, వేగవంతంగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్ సూచించారు. బుధవారం చౌట్కూరు మజరా గ్రామం గుడిపాడు గ్రామం జగనన్న లే అవుట్ పరిశీలించి గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో 40 మందికి ఇంటి పట్టాలు మంజూరుచేస్తే కేవలం ఒక్కరూ మాత్రమే ఇంటి పనులు ప్రారంభించారన్నారు. మిగిలిన లబ్ధిదారులను ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కొత్త కాంట్రాక్టర్ నమ్మి అడ్వాన్స్‌గా ఇచ్చామని, అతను ఇంటి పనులు చేపట్టుండా పరారయ్యారని తెలిపారు. అదే విదంగా మల్లికార్జున రిజర్వాయర్ కోసం ప్రతిపాదించారని, ఆ మాప్‌లో మా గ్రామం ఉందని, ఇళ్లు నిర్మించుకొని ఏమి ప్రయోజనం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసిల్దార్ మాట్లాడుతూ అలాంటి ప్రతిపాదన ఏది కూడా రాలేదని, అపోహాలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మదార్‌సాహెబ్, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ రమేష్, పీఎస్ రవీంద్రబాబు, వీఆర్వో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

పాములపాడు: జగనన్న కాలనీల్లోని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లబ్ధిదారులను ప్రోత్సహించి, ప్రభుత్వం అందిస్తున్న నగదు, మెటీరియల్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏఈ హౌసింగ్ శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికుంటలో ఆలయ చతుర్థ వార్షికోత్సవం

కొత్తపల్లి: మండల పరిధిలోని నందికుంట గ్రామ శివారుల్లో వెలసిన విశ్వమాత ఆలయం చతుర్థ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక పురోహితులు బాణాల లక్ష్మీనారాయణ ఆచార్యుల ఆధ్వర్యంలో మూడురోజుల వార్షిక చండీహోమంలో భాగంగా మొదటిరోజు గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ కలశ స్థాపన, విశ్వమాత మూల విరాటుకు అభిషేకములు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈశ్వరస్వామి తిరునాల ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన శివాలయంలో బుధవారం ఈశ్వరస్వామి తరునాల ప్రారంభం అయింది. గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అర్ధరాత్రి శివపార్వతుల కళ్యాణమహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెళ్లిపందిరివేశారు. శివాలయంలో ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రీ శివుడికి పాలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేషపూజలు చేశారు.

రేపు చౌడేశ్వరీ దేవీ జ్యోతి మహోత్సవాలు

మిడుతూరు: స్థానిక శ్రీ చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారు జ్యోతి మహోత్సవ వేడుకలు తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో శుక్ర, శని వారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, రాత్రి 2 గంటలకు జ్యోతి కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

శ్రీశైలంప్రాజెక్ట్: అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మయ్య, సీపీఐ కార్యదర్శి పి.పులిరాజు, ఏఐవైఎఫ్ జెండాను బస్టాండ్ ప్రాంగణంలో ఎగుర వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అన్ని శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి ఓబులయ్య, ఎస్‌కె అన్వర్‌బాషా వెంకట్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

పాములపాడు: ఈ నెల 11న డోన్ పట్టణంలో నిర్వహించనున్న మహాజన సోషలిస్ట్ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా కో కన్వీనర్ కోటా ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్యుల కోసం రోడ్డెక్కి పోరాటాలు చేసి విజయం సాధించిన నాయకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు నాగరాజు, బుడగ జంగం నాయకుడు జమ్మన్న, మాసుమయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఉద్యమం ఉధృతం

పాములపాడు: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న అన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖఉక్కును నేడు కేంద్ర ప్రభుత్వం కారు చౌకగా అమ్మాలని చూస్తోందన్నారు. ఈ ప్రయత్నాన్ని విరమించుకోకపోతే దేశంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, మధు, జయరాజు, షర్ఫుద్దీన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు


రోళ్లపాడులో నాభిశిల ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని రోళ్లపాడు గ్రామంలో నాభిశిల(బొడ్డురాయి), శ్రీ ఆంజనేయ స్వామి, నాగమయ్య స్వామి విగ్రహాలు, మారెమ్మ తల్లి కలశ ప్రతిష్ఠోత్సవ వేడుకలు బుధవారం వేదపండితులు భరద్వాజ శర్మ, శివ సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ప్రభాత పూజ, దీక్షా హోమం, గర్తన్యాసము, బీజన్యాసము, జయాది హోమం, ఉదయం 8.59 గంటలకు యంత్రప్రతిష్ఠాపన, క్షీరతర్పణము, విగ్రహప్రతిష్ఠ, కుష్మాండబలి, కక్ష జ్వాల దర్శనము, పూర్ణాహుతి, మంగళహారతి తదితర విశేషపూజలను చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పేరెడ్డి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ నాగారెడ్డి రామస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో విగ్రహాల ప్రతిష్ఠ


కలశాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో వైభవోపేతంగా శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వర స్వామి సహిత శ్రీ సుంకులా పరమేశ్వరి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. బుధవారం ఉదయం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అంతకు మునుపు కలశాలని గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి, శ్రీసుంకులాపరమేశ్వరి గుడి చుట్టూ ప్రదక్షణ చేసి ఆలయ గోపురంపై ప్రతిష్ఠించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో 7వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి చివరి రోజు స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. ఉత్సవాల్లో మొదటి రోజు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్, లాలం నాగార్జున, తాళ్లూరి గోపాల్, రవికుమార్, గద్వాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి కల్యాణ మహోత్సవం బుధవారం తెల్లవారుజామున కమనీయంగా సాగింది. ఆలయ ఈఓ గుర్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వేదపండితులు సుబ్రహ్మణ్య శర్మ, ఆలయ పురోహితులు వెంకటేశ్వర్ల సమక్షంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి, బన్నూరు నాగిరెడ్డి, కాతా రమేష్‌రెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి, తువ్వా రామనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శేషవాహనంపై దర్శనమిచ్చిన చెన్నకేశవవుడు

కల్యాణ మహోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను శేషవాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి హనుమత్ వాహనంపై ఉత్సవమూర్తులను పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించారు.

నేడు గరుడ సేవ

శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 4వ తేది గురువారం ఉదయం 8 గంటలకు ఉత్సవ మూర్తులు సింహవాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7.30 గటంలకు గరుడోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ గుర్రెడ్డి తెలిపారు.

గాజులపల్లెలో ఘనంగా పెద్దమ్మ జాతర


పెద్దమ్మ ఆలయం వద్దకు బోనాలతో వచ్చిన మహిళలు


ఉత్సవాలకు హాజరయ్యేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, భువనేశ్వరరెడ్డి

మహానంది: గాజులపల్లె గ్రామంలో పెద్దమ్మ జాతర మహోత్సవం సందర్భంగా బుధవారం గ్రామం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. 13ఏళ్ల తర్వాత ఉత్సవం జరగడంతో కులమతాలకు అతీతంగా గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఒకేరోజు రూ.కోట్లలో ఖర్చు అయినట్లు ప్రాథమిక సమాచారం. ఇంటింటికీ విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని బంధుమిత్రులను ఆహ్వానించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పెద్దమ్మ జాతర మహోత్సవానికి హాజరయ్యారు. గోపవరం సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు(గాజులపల్లె కిట్టు), ఎంపీటీసీ వడుగూరి లక్ష్మీదేవి ఆహ్వానం మేరకు వారి ఇంట్లో విదుకు హాజరయ్యారు. అలాగే గ్రామ వైఎస్సార్‌సీపీ నేత కొండా మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఉత్సవంపై మాట్లాడారు. ఆయన వెంట శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఉప్పు జగన్ ప్రసాద్, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని పాల్గొన్నారు

స్తంభించిన రాకపోకలు

గాజులపల్లెలో పెద్దమ్మ జాతర మహోత్సవం సందర్భంగా లక్షలాది సంఖ్యలో భక్తజనం తరలిరావడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. గాజులపల్లె మెట్ట నుంచి సుమారు 15కిలో మీటర్ల మేరకు నల్లమలలోని సర్వనరసింహస్వామి ఆలయం వరకు వాహనాలు నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.